



డీఎస్పీ ఆధ్వర్యంలో డ్రోన్‌తో ప్రమాద స్థలాలను గుర్తిస్తున్న దృశ్యం(ఫైల్)



జాతీయ రహదారిపై భోగాపురం సమీపంలో ప్రమాదం(ఫైల్)

పదే పదే ప్రమాదాలు

- జిల్లాలో 48 బ్లాక్‌స్పాట్స్ గుర్తింపు
- అయినా ఉపయోగం లేనివైనం
- రోడ్ల నిర్మాణాల తీరుపై అనుమానాలు
- ఇంజనీర్లను సంప్రదిస్తున్న పోలీసులు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గడం లేదు. ఆయా ప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా పోలీసులు గుర్తించినా ఉపయోగం లేకుండా పోతోంది. జిల్లా కేంద్రంలో రాజాపులోవ నుంచి కనిమెరక (విజయనగరం-శ్రీకాకుళం) బోర్డర్.. అదే విధంగా గజపతినగరం రోడ్డులో సీతానగరం వరకూ (విజయనగరం బోర్డర్) ఉన్న ప్రాంతాల్లో 48 బ్లాక్ స్పాట్స్ (ప్రమాదాలు జరిగే ప్రదేశాలు)ను గుర్తించారు. మూడేళ్ల క్రితమే కసరత్తు చేసి బ్లాక్ స్పాట్స్ వద్ద గుర్తింపు బోర్డులు, రేడియం స్టిక్కర్లు, లైట్లు ఏర్పాటు చేశారు. అయినా గత మూడేళ్లలో జిల్లాలో 48 బ్లాక్‌స్పాట్స్ పరిధిలో 47 మంది వివిధ ప్రమాదాల్లో మరణించారు. 250 మంది క్షతగాత్రులయ్యారు. దీంతో అసలు రోడ్ల నిర్మాణంలో తేడా ఉందా అని సంబంధిత ఇంజనీరింగు అధికారులు పరిశీలించాలని పోలీసు అధికారులు లేఖ కూడా రాశారు.

- విజయనగరం క్రైం, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):

గుర్తించినా చర్యల్లేవ్

రాజాం రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తరచూ ప్రమాదాలు జరిగే నాలుగు ప్రదేశాలను (బ్లాక్‌స్పాట్స్) రాజాం ప్రాంతంలో పోలీసులు డ్రోన్ సహాయంతో గతంలో గుర్తించారు. చీపురుపల్లి రోడ్‌లోని గాయత్రీకాలనీ, బొబ్బిలి రోడ్‌లోని ఫైర్‌స్టేషన్ నుంచి కంచరాం వెళ్లే మార్గం, శ్రీకాకుళం రోడ్‌లోని అంతకాపల్లి ఏరియా, పాలకొండ రోడ్‌లోని గురవాం గ్రామ జంక్షన్‌ను గుర్తించారు. చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, రాజాం టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గతేడాది అక్టోబర్ 29న ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆయా ప్రదేశాలలో ప్రమాదాల నియంత్రణకు హెచ్చరికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయనున్నట్టు డీఎస్పీ స్పష్టం చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించిన ఏరియాల్లో పోలీసులు అలాంటి ఏర్పాట్లు చేసిన దాఖలాల్లేవు.



ప్రమాదకరంగా సోంపురం కూడలి

బ్లాక్‌స్పాట్స్‌పై ప్రత్యేక చర్యలు

ఎస్పీ వకుల్ జిందాల్

జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ప్రమాదాలు తరచూ జరుగుతున్న ప్రాంతాలను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులు గుర్తించాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రమాదాలకు కారణాలపై రహదారుల ఇంజనీర్లను కూడా అడిగి తెలుసుకోవాలని సూచించాం. పోలీసుశాఖ తరుపున కాషన్స్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు, లైట్లు వంటివి ఏర్పాటు చేస్తున్నాం.

రామతీర్థం రోడ్డు అధ్వానం

నెల్లిమర్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల-శ్రీకాకుళం జిల్లా రణస్థలం రోడ్డులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డు సంవత్సరాల కాలంగా గుంతలు పడినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు శ్రీకాకుళం జిల్లాకు అనుసంధానంగా ఉండడంతో వాహన రాకపోకలు అధికంగానే ఉంటాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.



హైవేపై ఆగని ప్రమాదాలు

భోగాపురం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల పరిధిలో మహరాజపేట నుంచి సుందర పేట ఎత్తు బ్రిడ్జి డౌన్ వరకు సుమారు 14.1 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉంది. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. జనవరి 2024 నుంచి మార్చి 2025 వరకు 66 ప్రమాదాలు జరగ్గా అందులో 28 మంది మృత్యువాత పడ్డారు. మండలంలో సుందరపేట, సవరవల్లి, పోలిపల్లి, రాజాపులోవ, మహరాజపేట పరిధి హైవే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి ఆయా ప్రాంతాల్లో డివైడర్లపై బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పోలిపల్లి లింగాలవలస సమీప జాతీయరహదారిపై రెండు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు.

విశాఖ-అరకు రోడ్డులో తరచూ ప్రమాదాలు

శృంగవరపుకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండలం కొత్తూరు గ్రామ సమీపంలో వున్న చెరువు వద్ద పెద్ద మలుపు ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పాటు అతివేగంతో వచ్చే వాహనాలు అక్కడ అదుపు తప్పుతున్నాయి. దీంతో అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే విదంగా ఈ గ్రామం దాటిన తరువాత వెంకటరమణ పేటకు వెళ్లేందుకు చెరువు గట్టుపై రోడ్డు ఉంది. ఈ రోడ్డు, విశాఖ-అరకు రోడ్డును కలిపే క్రమంలో మరో మలుపు ఉంది. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లక్కవరపుకోట మండలం సోంపురం కూడలి నుంచి గోల్గాం వేళ్లే రోడ్డు సమీపంలోనూ తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



ఉపాధిలో అట్టడుగున..!

- కనీస వేతనంలో జిల్లాకు చివరి స్థానం
- సగటు వేతనం కేవలం రూ.162
- రూ.241 తో వంగర మండలం ప్రథమ స్థానం
- రూ.125తో చివరిస్థానంలో గరివిడి
- ఉపాధి హామీ అధికారులు, సిబ్బందికి షోకాజ్‌లు
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే క్రమశిక్షణ చర్యలు: డ్వామా పీడీ శారదాదేవి

మెంటాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):

ఉపాధి హామీ పథకం అమల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా అట్టడుగున నిలవడం అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది. కూలీలకు అందుతున్న సగటు కనీస వేతనం జిల్లాలో రూ.162గా నమోదైంది. దీంతో ఉపాధి హామీ పథకం సిబ్బంది, అధికారుల్లో కలవరం నెలకొంది. షోకాజ్ నోటీసులు జారీ అయినట్లు సమాచారం. వాస్తవానికి ఈనెల ఒకటి నుంచి వేతనదారులకు కనీస వేతనం రూ.307 ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాన్ని అందుకోవడానికి యంత్రాంగం ఆపసోపాలు పడుతోంది. సరిగ్గా ఇదే సమయంలో జిల్లాలవారీగా కూలీలకు అందుతున్న సగటు వేతనలతో కూడిన జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని 26 జిల్లాల జాబితాలో సగటు వేతనం రూ.162.30తో విజయనగరం జిల్లా చివరి స్థానంలో ఉంది. ఈ జాబితాలో ఎన్టీఆర్ జిల్లా రూ.291.53తో మొదటి స్థానంలో నిలిచింది. రూ.290.60తో కోనసీమ జిల్లా రెండో స్థానంలో నిలవగా, 289.43తో అల్లూరి జిల్లా మూడో స్థానంలో ఉంది.

జిల్లాలో సగటు ఉపాధి వేతనం 162.30 కాగా రూ.241.76తో వంగర మండలం ప్రథమ స్థానంలో ఉంది. రూ.225.56తో పూసపాటిరేగ మండలం రెండో స్థానంలోనూ, రూ. 224.16తో భోగాపురం మూడో స్థానంలో ఉన్నాయి. రూ.125.30తో వేపాడ మండలం చిట్టచివరన నిలిచింది. మెంటాడ మండలం చింతాడవలస పంచాయతీలో దినసరి వేతనం రూ.80 రావడంతో కొద్దిరోజులు క్రితం ఉపాధి వేతనదారులు ఆందోళన చేపట్టారు. ఇలా చాలా పంచాయతీలలో వందలోపు వేతనం లభించింది. అంటే ఉపాధి వేతనదారులు ఏమి తినాలి, కుటుంబాన్ని ఎలా నెట్టుకు రావాలో అధికారులకే ఎరుక.

రూ.1.80 కోట్లు నష్టపోయిన కూలీలు..

కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాన్ని ఈనెల ఒకటో తేదీ నుంచి రూ.307గా సవరించింది. కానీ జిల్లాలో సగటున గిట్టుబాటు అయిన వేతనం 162 రూపాయలే. జిల్లాలో ఉపాధి వేతనదారుల సంఖ్య చూస్తే లక్షా 24 వేల 149 మంది ఉన్నారు. వీరంతా కూలి రూపంలో నష్టపోయింది కోటి 80 లక్షల 1605 రూపాయలు.

షోకాజ్ నోటీసులు..

కనీస వేతనం కల్పించడంలో విఫలమైన అధికారులు, సిబ్బందికి డ్వామా పీడీ ఎస్.శారదా దేవి గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు, జేఈ, ఈసిలకు కూడా నోటీసులు జారీ చేసి మూడురోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఇవ్వకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని (మిగతా 8వ పేజీలో..)

మహిళల ఉపాధికి భరోసా

- జీవనోపాధి కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- యూనిట్ల ఏర్పాటులో వారిదే తుది నిర్ణయం
- రుణ ప్రణాళికల తయారీపై జోరుగా సర్వే

చీపురుపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. వారి జీవనోపాధిపై ప్రత్యేక దృష్టి సారించింది. సర్వేకు ఉపక్రమించింది. తద్వారా వారి అవసరాలు, ఆలోచనలు తెలుసుకుని అందుకనుగుణంగా రుణ సాయం అందించాలని భావిస్తోంది. ఇదే సమయంలో గతంలో తీసుకున్న రుణాలు, ఆ మొత్తంతో చేకూరిన లబ్ధిపై కూడా ఆరా తీస్తోంది. ముఖ్యంగా పొదుపు సంఘాల మహిళల ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచి, వారి జీవన ప్రమాణాలను గతంలో కంటే బాగా ఉండాలన్న లక్ష్యంతో తగిన ప్రణాళికలు రూపొందిస్తోంది.

2026 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో మహిళలకు ఏయే రంగాల్లో ఉపాధి కల్పించాలన్న అంశంపై యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ విషయంలో మహిళల వ్యక్తిగత.. వ్యాపార ఆసక్తి, వారికున్న అనుభవాలు, అవకాశాలు, యూనిట్ ఏర్పాటుకు అవసరమైన రుణాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జీవనోపాధుల రుణ ప్రణాళిక తయారు చేయడం కోసం అధికారులు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సర్వే ప్రారంభించారు.

గతానికి భిన్నంగా

గతంలో బ్యాంకు లింకేజీ లేదా అంతర్గత రుణాలు పొందిన మహిళలు అధికారుల సలహాలు, సూచనల మేరకు యూనిట్లను నెలకొల్పేవారు. అందుకు భిన్నంగా ఇప్పుడు పొదుపు మహిళల ఆసక్తి, అవకాశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళలు నెలకొల్పాలనుకుంటున్న యూనిట్ ఆధారంగా రుణ సహాయం అందించాలన్న లక్ష్యంతో ఇప్పుడు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఆ ప్రకారమే వివరాలు కూడా సేకరిస్తు న్నారు. ఇందు కోసం ఒక్కో వీఏఓ పరిధిలో గరిష్టంగా 8 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వీరికి (మిగతా 8వ పేజీలో..)



మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు

జనసేన నాయకునిపై హత్యాయత్నం

- కత్తితో దాడి చేసిన వైసీపీ కార్యకర్త
- అపస్మారక స్థితిలో బాధితుడు
- స్టేషన్ వద్ద భారీగా మోహరించిన జనసైనికులు

రామభద్రపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం మండల కేంద్రంలో జనసేన జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి ధనంజయపై ఆదివారం రాత్రి హత్యాయత్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో కోట్లాది రూపాయలు విలువ చేసే ఒక ప్రభుత్వ స్థలాన్ని స్థానిక వైసీపీ నాయకుడు ఆక్రమించి చాలా ఏళ్లు తన ఆధీనంలో ఉంచుకున్నాడు. ఈ స్థలాన్ని స్థానికుడైన వైసీపీ కార్యకర్త అక్కునాయుడుకు విక్రయించాడు. అక్కునాయుడు తాజాగా పండ్ల దుకాణం పెట్టాడు. ఇప్పటికే ఈ భూమి విషయంలో గొడవ నడుస్తోంది. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. అయినా కూడా పట్టించుకోకుండా పండ్ల దుకాణం ఏర్పాటు చేయడంపై జనసేన నాయకుడు మహంతి ధనంజయ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. స్టేషన్ నుంచి ఇంటికి వెళుతున్న ధనంజయపై ఆదివారం రాత్రి అక్కునాయుడు కత్తితో తలపైన, వీపుపైన తీవ్రంగా గాయపరిచాడు. గాయాలైన ధనంజయను బంధువులు రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. తలపై నాలుగు కుట్లు, వీపుపై ఐదు కుట్లు వేసి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి (మిగతా 8వ పేజీలో..)



గాయపడిన జనసేన నాయకుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

సంస్కరణలతో ఫలితాలు

- సర్కారు కళాశాలల్లో రాణిస్తున్న విద్యార్థులు
- గత ఐదేళ్ల కంటే మెరుగ్గా ఉత్తీర్ణత
- ప్రశంసలందుకుంటున్న కేజీబీవీ, మోడల్ కాలేజీలు
- ఫలించిన పాఠ్య పుస్తకాల పంపిణీ.. మధ్యాహ్న భోజనం పథకం అమలు



కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకొచ్చిన సంస్కరణలతో ఫలితాలు కూడా భిన్నంగా ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు రాణిస్తున్నారు. ఇందుకు ఇంటర్ ఫలితాలే ఉదాహరణ. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి. గత ఐదేళ్ల కంటే ఉన్నతంగా రాణించారు. కొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అయితే కార్పొరేట్‌కు దీటుగా ఉత్తీర్ణత చాటారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఏపీ మోడల్ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయి. నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివిన విద్యార్థిని బర్ల లలిత బైపీసీ గ్రూపులో 1000కి 989 మార్కులు సాధించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూనియర్ కళాశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముందుగా పాఠ్యపుస్తకాలతో పాటు బ్యాగ్‌లు కూడా అందజేసింది. దీనివల్ల పుస్తకాలను బయట కొనుగోలు చేసుకోలేని వారికి ఊరట కలిగింది. ఇదిలా ఉంటే ఈ ప్రభుత్వ హయాంలోనే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేశారు. విద్యార్థులు తృప్తిగా కాలేజీలో భోజనం చేసే పరిస్థితి కన్పించింది. గత వైసీపీ హయాంలో పుస్తకాలు పంపిణీ గాని, మధ్యాహ్నం భోజనం పథకం అమలు వంటి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఈ ప్రభావం పరీక్షా ఫలితాలపై పడేది. అప్పట్లో కనీస స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈ ప్రభుత్వం వీటిని సరి చేయడంతో ఇప్పుడు సర్కారు కళాశాలల్లో చక్కని ఫలితాలు వచ్చాయి.

ఇంటర్ ప్రథమ సంవత్సరం కంటే ద్వితీయ సంవత్సరంలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా రెండో సంవత్సరానికి సంబంధించి 1327 మంది పరీక్ష రాశారు. 935 మంది ఉత్తీర్ణత(70.45) సాధించారు. మెరకముడిదాం జూనియర్ కాలేజీ 98.89 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో ఉండగా .ఎస్.కోట ప్రభుత్వం జూనియర్ కాలేజీలో 36.46 శాతం విద్యార్థులు అత్యల్పంగా ఉత్తీర్ణత సాధించారు.

ప్రథమ సంవత్సరం విషయానికి వచ్చే సరికి 1828 మంది పరీక్ష రాయగా 885 మంది పాస్ అయ్యారు. 48.41 శాతం ఉత్తీర్ణత సాధించారు. గుర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అత్యధికంగా 82.72 శాతం ఉత్తీర్ణత సాధించగా, చీపురుపల్లి జూనియర్ కాలేజీలో అత్యల్పంగా 18.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ గ్రూపులో మొదటి సంవత్సరం 54.77 శాతం, రెండో సంవత్సరం 73 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కళాశాల వారీగా వచ్చిన ఫలితాలు..

కళాశాల పేరు	మొదటి సంలో రాసిన వారు	ఉత్తీర్ణత సాధించిన వారు	శాతం	రెండో సంలో రాసిన వారు	ఉత్తీర్ణత సాధించిన వారు	శాతం
జీజేసీ రాజాం	145	42	28.97	79	45	56.96
జీజేసీ గర్ల్స	92	39	42.39	13	11	84.62
జీజేసీ వంగర	107	72	67.29	102	84	82.35
జీజేసీ సంతకవిటి	145	52	35.86	125	70	55.56
జీజేసీ పూసపాటిరేగ	98	23	23.47	57	22	38.60
జీజేసీ డెంకాడ	79	38	48.10	40	39	97.50
జీవిఆర్ చీపురుపల్లి	93	17	18.28	75	37	49.33
జీజేసీ మెరకముడిదాం	75	62	82.67	62	61	98,38
జీజేసీ ఎస్.కోట	100	32	32.00	96	35	36.46
జీజేసీ వేపాడ	64	51	79.69	42	39	92.98
జీజేసీ బాడంగి	114	73	64.04	92	83	90.22
జీజేసీ గుర్ల	162	134	82.72	138	130	94.20
సీకెఎం నెల్లిమర్ల	215	122	56.74	158	136	86.08
జీజేసీ గజపతినగరం	65	25	38.46	57	32	56.14
జీజేసీ దత్తిరాజేరు	11	3	27.27	2	1	50.00
జీజేసీ కొత్తవలస	72	20	27.78	63	33	52.38
జీజేసీ గంట్యాడ	44	23	52.27	37	30	81.08
జీజేసీ విజయనగరం	147	57	38.78	88	47	53.41
మొత్తం	**1882**	**885**	**48.41**	**1327**	**935**	**70.45**

ఆర్వో ప్లాంట్ లేక.. మరుగుదొడ్లు పూర్తికాక



ప్రహరీ గోడ కూలిపోయిన దృశ్యం

●శిథిలావస్థకు చేరిన ప్రహరీ● కట్టెలపైనే వంటలు నిర్వహిస్తున్న వైనం ● ఇదీ చింతాడ జడ్పీ ఉన్నతపాఠశాలలో దుస్థితి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా ఇక్కడ ఆర్వోప్లాంట్ లేకపోవడంతో తాగునీటికి విద్యార్థులు అగచాట్లకు గురవుతున్నారు. దీనికి తోడు మరుగుదొడ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రహరీ శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

చింతాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో 169 మంది విద్యార్థులు 15 మంది ఉపాధ్యాయులతో విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ కలవసరాయి, కోమటిపల్లి, చింతాడ, పక్కి, రాముడువలస, వాకడవలస, పర్లి, తదితర గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుతున్నారు. అయితే గత ప్రభుత్వంహయాంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశారు. కానీ చింతాడ ఉన్నత పాఠశాలలో ఇప్పటివరకు ఇక్కడ ప్లాంటు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడంలేదు. పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరుకుంది. రెండుచోట్ల గోడ కూలిపోవడంతో పశువులు,పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి చొరబడి అపరిశుభ్రం చేస్తున్నాయి. పాఠశాల ఆవరణలో మరుగుదొడ్లు పనులు పూర్తికాకుండేనే వినియోగంలోకి తీసుకువచ్చారు. అందులో ఎటువంటి సౌకర్యాలు లేవని విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో గ్యాస్ సిలిండర్లు సరిపోకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు కట్టెల పొయ్యి మీదే వంటను చేయాల్సివస్తోంది. కాగా ఆర్వోప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపించామని హెచ్ఎం దీవానమ్మ తెలిపారు. ప్రహరీ గురించి సర్పంచ్‌కు తెలియ జేశామని, త్వరలో మరమ్మతులు చేయి స్తామని తెలియజేశారని చెప్పారు. మరుగుదొడ్ల చివరి దశ పనులు త్వరలో చేపడతామని తెలిపారు.

టీటీడీపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

●కరుణాకరరెడ్డి వ్యాఖ్యలకు ఖండన
● టీడీపీ నాయకుల పిలుపు



గజపతినగరం: మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



కొత్తవలస: మాట్లాడుతున్న లలితకుమారి



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

టీటీడీపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాలోని వేర్వేరు చోట్ల విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

అసత్య ఆరోపణలు తగదు: మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):టీటీడీపై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడంతగదని మంత్రి కొండపల్లిశ్రీనివాస్ హితవుపలికారు.ఆదివారం గజపతినగరంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో తిరుపతి పవిత్రను భ్రష్టు పట్టించిన వైసీపీ నాయకులు అధికారం కోల్పోయిన వెంటనే దేవస్థానంపై తప్పుడు ప్రచారానికి తెరలేపారని, దాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. వేసవిలో మూడునెలలపాటు వీఐపీ దర్శనాలు నిలిపివేసి సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా టీటీడీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తగదని పేర్కొన్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న హయాంలో ఎటువంటి అవినీతి జరిగిందో ప్రజలందరికీ తెలుసన్నారు.నెయ్యిలో కల్తీ చేసి వ్యాపారం చేసిన వారు నేడు తిరుమల పవిత్ర గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో పైడితల్లి అమ్మవారి పండగ, శ్రీకాకుళంలో సూర్య భగవానుడి ఆలయానికి ప్రభుత్వం తరఫున 50 లక్షలు చొప్పున మంజూరు చేసి ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. ఐదేళ్లగా పడకేసిన పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిన పెడుతున్నారని, అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించేందుకు ప్రజల సహకరించాలని కోరారు.

మాట్లాడే అర్హత కరుణాకరరెడ్డికి లేదు: కోళ్ల

కొత్తవలస, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ గురించి మాట్లాడే అర్హత భూమన కరుణాకరరెడ్డికి లేదని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. ఆదివారం కొత్తవలసలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ టీడీపీ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావుతో కలిసి విలేకరులతో మాట్లాడేరు.తన హయాంలో ఎన్నో కుంభకోణాలకు పాల్పడిన కరుణాకరరెడ్డికి స్వామివారిపైనమ్మకం లేదన్నారు.తన హయాంలో కరుణాకరరెడ్డి ఎన్నో కుంభకోణాలకు పాల్పడ్డారన్నారు. టీటీడీ నిధులను దారి మళ్లించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి అప్పారావు, కోళ్ల వెంకటరమణ, యల్లపు సూరిబాబు, దుర్గా ఉమేష్, కొరుపోలు అప్పారావు పాల్గొన్నారు.

ఆరోపణలు పూర్తిగా అవాస్తవం: అదితి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ గోశాలలు, గోవులపై చేసిన వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయని కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. కోట్లాదిమంది భక్తులు వేంకటేశ్వర స్వామిని నిండు మనస్సుతో కొలుస్తారని, అటువంటి భక్తుల మనోభా వాలను కరుణాకరెడ్డి దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అలజడికోసమే అసత్య ప్రచారం: కర్రోతు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అలజడి సృష్టించేందుకే టీటీడీ గోశాలలపై మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అసత్యప్రచారాన్ని చేస్తున్నారని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు.ఆదివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలోకూడా భూమన కరుణాకరరెడ్డి ఇటువంటి వ్యాఖ్యలుచేసి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు.అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.వృద్ధాప్యం, వ్యాధులు తదితర కారణాలతో గోవులు మర ణిస్తుంటాయని, దానిని కూడా భూమన కరుణాకరరెడ్డి లాంటి వారు ఈ విధమైన అసత్యప్రచారాలకు దిగితే, వీటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి

రాజాం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు, ఆసుపత్రుల యాజమాన్యాలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టణ సీఐ కె.అశోక్‌కుమార్ కోరారు. ఆదివారం రాజాంలో స్నేహం బృందం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ సీసీ కెమెరాలు ద్వారా ఇటీవల చాలా మంది నేరస్థులను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు, రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారగ్రహీత గార రంగనాథన్ని సన్మానించారు. విధి నిర్వహణలో నిజాయితీ ప్రదర్శించిన కానిస్టేబుల్ ఎ. సంతోష్‌కుమార్, రాజశేఖర్‌ను కూడా స్నేహ బృందం సన్మానించింది. కార్యక్రమంలో అంబికా కోటీశ్వరరావు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, పొట్టా వెంకటేశ్వరరావు, అచ్యుతకుమార్, గట్టి పాపారావు, పడాల కవీశ్వరరావు పాల్గొన్నారు

పెదబంటుపల్లిలో బడిబాట

గుర్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని పెదబంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె. శ్రీనివాసరావు తెలిపారు.ఆదివారం పెదబంటుపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐదో తరగతి పూర్తయిన విద్యార్థుల ఇంటింటికి వెళ్లివారి తల్లిదండ్రులను కలిసి పిల్లలనుపాఠశాలలో ఆరోతరగతిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, పల్లి రాంబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వేపాడ,ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని వల్లంపూడి ఎస్ఐ బోడ్డు దేవి సూచించారు. ఆదివారం మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నైతిక ప్రవర్తన, లైంగిక దాడులు పట్ల అప్రమత్తత, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలుగు నష్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ప్రతిభా పురస్కారానికి ఎంపికైన తొమ్మిదోతరగతి విద్యార్థిని హసినిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, హెచ్ఎం రాజు పాల్గొన్నారు.

గ్రామసభలపై అవగాహన

శృంగవరపుకోట రూరల్,ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలో సోమవారం నుంచి జరగనున్న గ్రామసభల గురించి గ్రామాల్లో ప్రజలకు దండోరా ద్వారా తెలియజేయకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని ఓటరు అక్షరాస్యత జిల్లా అధ్యక్షుడు దొడ్డిసూర్యారావు ఆరోపించారు. ఆదివారం మండలంలోని కృష్ణాపురం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామసభల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాల గ్రామాల్లో గ్రామ సభల గురించి తెలియజేయకపోవడం రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

ముషిడిపల్లిలో ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముషిడిపల్లి గ్రామ పరిధిలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను ఆదివారం తొలగించారు. ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో ఓ వ్యక్తి డిపట్టా, చెరువు స్థలంలో రోడ్లు వేశారని, ఈ విషయం ప్రస్తుతం కోర్టులో ఉండడంతో ఆయన అందులో హోర్డింగ్‌లు, ఫెన్సింగ్ ఎలా ఏర్పాటు చేస్తారని గ్రామానికి చెందిన యువకులు ప్రశ్నించారు. వీటిని విలేకరులకు చూపించారు. ఈ నేపథ్యంలో వీఆర్వో నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ముషిడిపల్లికి చెందిన ముత్యాల సన్యాసిరావు, టి.గంగరాజు,పైడిరాజు తదితరులు మాట్లాడుతూ ఇక్కడ వేసిన ఓ లేఅవుట్‌లోకి 60 అడుగుల రోడ్డు వేశారని, ఇందులో ముగ్గురు గిరిజనులకు చెందిన ఎకరన్నర డీపట్టా భూమి ఉందని, అలాగే ఏడు సెంట్లు చెరువు భూమి ఉందని గతంలో ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు నిర్ధారించారని, వీటిని తొలగించాలని రెవెన్యూఅధికారులు నోటీసులిచ్చినట్లు తెలిపారు. అయితే ఆ వ్యక్తి గత ప్రభుత్వంహయాంలో కోర్టుకు వెళ్లి యథాతథ స్థితిని తెచ్చుకున్నారని చెప్పారు. కోర్టు ఆర్డర్ ఉన్న సమయంలో ఆ స్థలంలో హోర్డింగ్‌లు, ఫెన్సింగ్ ఎలా ఏర్పాటుచేస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వీఆర్వో నాయుడు ఆ స్థలంలో వేసిన ఫెన్సింగ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌కు ఈ విషయం నివేదిస్తామని తెలిపారు. నాయుడు తహసీల్దార్ అరుణకుమారికి నివేదిక ఇచ్చిన 24 గంటల్లో సదరు యాజమాన్యానికితహసీల్దార్ వీటిని తొలగించని పక్షంలో తామే తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో సదరు నిర్వాహకులు ఆయా స్థలాల్లో ఏర్పాటుచేసిన హోర్డింగులు, ఫెన్సింగ్‌ను స్వచ్ఛందంగా తొలగించారు.

పి.లింగాలవలసలో గడ్డివాముల దగ్ధం

దత్తిరాజేరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.లింగాలవలసలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ పశువులశాలతోపాటు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గండి సింహాచలానికి చెందిన పశువులశాల, గడ్డివాముతోపాటు గండి కృష్ణ, కడేల యేసేబుకు చెందిన గడ్డివాములు కాలిపోయాయి. ఈవిషయం తెలుసుకున్న బాడంగి అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గరివిడి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పీజేపాలెంసెంటర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమరాం గ్రామానికి చెందిన బెల్లాన త్రినాథ్ గాయపడ్డాడు. రాజాం నుంచి చీపురుపల్లి వైపు వస్తున్న కారు త్రినాథను ఢీకొనడంతో గాయపడ్డాడు. దీంతో స్థానికులు చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం త్రినాథ్ విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

జేబుదొంగల చేతివాటం

బొండపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసింగిపేటలో ఆదివారం జరిగిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకల్లో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఐదు నుంచి ఆరుగురి కార్యకర్తల జేబుల్లోని పర్సుల్లో నగదు దొంగిలించినట్లు సమాచారం. ఏ ఒక్క బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేయలేదు. కాగా జేబుదొంగల చేతివాటంపై దర్యాప్తుచేస్తామని ఎస్ఐ మహేష్ దర్యాప్తు తెలిపారు.

●గజపతినగరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గజపతినగరంలో నిర్వహించిన మంత్రి జన్మదిన వేడుకల్లో జేబుదొంగలు చేతివాటాన్ని ప్రదర్శించారు. పలువురు టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు గజపతినగరం సీఐ జీఏవీ రమణ ముగ్గురిని అదపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతనం వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఎస్పీ ఆదేశాల మేరకుఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 207 మంది పై కేసులు నమోదు చేశారు.

హామీలు నెరవేర్చకుండా కాలయాపన

గుర్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని వైసీపీ మండలాధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు విమర్శించారు. ఆదివారం పాలవలసలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు.

క్రీడా వార్షికోత్సవం ప్రారంభం

నెల్లిమర్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):స్థానిక మహారాజా వైద్య కళాశాలలో క్రీడా వార్షికోత్సవం క్రీడా కృత్య-2025 ఆదివారం ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో శ్రీరామ ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ ఎ.సత్యనారాయణ, కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ సి.రఘురాం, అకడమిక్ డైరెక్టర్ టి.వేణుగోపాలరావు, మెడికల్ సూపరింటెండెంట్‌వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.నీలిమా తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయల కల్పనకు కృషి

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



రాజాం: మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

సంతకవిటి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రోడ్లు, కాలువలు, మంచినీరుతదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ తెలిపారు. ఆదివారం మండలంలోని ఇజ్జిపేట వద్ద మొగలివలస సెంటర్ నుంచి ఇజ్జిపేట వరకు తారు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ టీటీడీలో గోమరణాలపై భూమణ కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేసి, మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలు మానుకోవాలని కోరారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులుకొల్ల అప్పలనాయుడు, వల్లూరు గణేష్, గట్టి భాను, సమతం శ్రీను, మహేష్‌బాబు, సలాది రమా, శంకరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

●రాజాం,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):వైసీపీ పాలనలో పంచాయతీలు నిధులు లేమితో అభివృద్ధికి నోచుకోలేదని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేపడుతోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. రాజాం నుంచి బొబ్బిలి పంచాయతీ పరిధిలోగల తారు రోడ్డు నిర్మాణానికి మెగిలివలస వద్ద శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీటీడీ గోమరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కొళ్ల అప్పలనాయుడు, బొత్స వాసుదేవరావునాయుడు, కోండ్రు జగదీష్, గురవాన నారాయణరావు, నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, దూబ ధర్మారావు, పొట్నూరు లక్ష్మణరావు, మాడుగుల జయరాం, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న వైసీపీ

●తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు



చీపురుపల్లి: మాట్లాడుతున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గోవుల మృతిపై వైసీపీ నాయకులు లేనిపోని ప్రకటనలు చేసి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు విమర్శించారు. ఆదివారం చీపురుపల్లిలోని విలేకరులతో మాట్లాడుతూ భూమన కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో పలు కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. తాళిబొట్లు, ప్లాస్మా టీవీలు, డాలర్లు మాయంకావడంతోపాటు దర్శనం టికెట్లలో అవినీతి జరిగిందని విమర్శించారు. కోవిడ్ సమయంలో స్వామివారి ప్రసాదాలను కూడా దారి మళ్లించిన ఘనత ఆయనదేనన్నారు. అటువంటి వ్యక్తి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత పాలకుల హయాంలో దేవస్థానం ప్రతిష్ట దిగజారిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై రాష్ట్ర ప్రజలకు అపారమైన నమ్మకం ఉందన్నారు.ఆడవారిపై అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్త కిరణ్‌పై తక్షణమే చర్యలు తీసుకుని చంద్రబాబు తన నిబద్ధతను నిరూపించుకున్నారన్నారు. సమావేశంలో కామునాయుడు, రామచంద్రుడు, బలరాం, సురేష్, ఇజరోతు రాంబాబు, మొగసాల రమేష్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ ఒకరు మృతి

రామభద్రపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎస్.సీతారాంపురం గ్రామానికి చెందిన మునకాల వెంకటరమణ(37) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వి.ప్రసాదరావు ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వెంకట రమణ గతంలో నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. మూడేళ్లగా మద్యం తాగడం మానేశాడు. అయితే మూడు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. రెండు రోజుల నుంచి ఆ నొప్పి కాస్త ఎక్కువయ్యింది. దీంతో ఆసుపత్రికి తీసుకువెళ్లి చూపిస్తానని చిన్న కుమారుడు కార్తీక్ చెప్పాడు. అయినా వెంకటరమణ వినకుండా శనివారం చినమ్మతల్లి గుడి సమీపంలోని మామిడితోటలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని.. వెంకటరమణను బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. వెంకటరమణ అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. పెద్ద కుమారుడు పృథ్వీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

జిల్లాలో వేర్వేరుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.దీంతో ఆయా కుటుంబాల్లో విషాదచాయలు అలముకున్నాయి.

చెట్టుకు ఢీకొట్టి.. క్యాబిన్‌లో ఇరుక్కొని



నాగరాజు (ఫైల్)

రేగిడి, ఏప్రిల్13,(ఆంధ్రజ్యోతి):మండలంలోని పాలకొండ- రాజాం రూట్‌లోని రెడ్డిపేట సెంటర్ మలుపు వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ టిప్పర్ మర్రి చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ నీలావతి కథనం మేరకు.. అనకాపల్లి రూరల్ మండలంలోని గొళ్లపేటకు చెందిన పల్లానాగరాజు(30) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.శుక్రవారం లోడు దింపేందుకు సాలూరు వచ్చాడు. అక్కడ పనిపూర్తిచేసుకొని ఖాళీగా వెళ్లకుండా ఇసుకలోడు కోసం రాజాం మీదుగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాలకొండవైపు వస్తున్నాడు.ఈక్రమంలో టిప్పర్ రెడ్డిపేట మలుపు వద్ద అదుపుతప్పి మర్రిచెట్టును ఢీకొట్టింది. దీంతో నాగరాజు క్యాబిన్‌లో ఇరు క్కుపోయాడు.ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో డ్రైవర్ సీటులోనే మృతిచెందాడు. నాగరాజుకు భార్య హేమవర్షిణి ఇద్దరుకుమార్తెలు ఉన్నా రు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా పూర్తి చేసి రాజాం పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుని కలవడానికి వెళ్లి వస్తుండగా..



వినయ్ కుమార్ (ఫైల్)

కొత్తవలస, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస-విజయనగరం రోడ్డులో బలిఘట్టం-ఎర్రవానిపాలెం మధ్యలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన సర్వసిద్ధి వినయ్‌కుమార్(27) ఎస్.కోట సీహెచ్‌సీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం విధులు ముగించుకుని కంటకాపల్లి జంక్షన్‌లో ఉన్న తన స్నేహితుని కలవడానికి బయలుదేరాడు. ద్విచక్ర వాహ నంపై వస్తుండగా కొత్తవలస నుంచి కంటకాపల్లి వైపు వెళ్తున్న లారీ వినయ్‌కుమార్‌ను ఎర్రవానిపాలెం- బలిఘట్టాం మధ్యలో గ్రామ సచివాలయం సమీపంలో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వినయ్‌కుమార్ శరీరం ముక్కముక్కలుగా రోడ్డంతా చెల్లాచెదురుగా పడిపోయాయి. కాగా లారీ డ్రైవర్ పరారయ్యాడు.వినయ్‌కుమార్‌కు ఏడాది కిందట వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె భార్య గర్భిణిగా ఉంది. కొత్తవలస పోలీసులకు వినయ్‌కుమార్ సోదరుడు ఫిర్యాదు చేశారు. పరారైన లారీ డ్రైవర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని సీఐ షణ్ముఖరావు తెలి పారు. వినయ్ కుమార్ శరీర భాగాలను పోగుచేసి శృంగవరపుకోట ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం ఆదివారం తరలించారు.

లారీ ఢీకొని ఒకరు..

కొమరాడ, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): కొమరాడలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తవలస గ్రామానికి చెందిన బిడ్డిక లక్ష్మణ్(65) మృతిచెందాడు. రహదారి పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న లక్ష్మణ్‌ను రాయగడ వైపు నుంచి పార్వతీపురం వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మణ్‌పై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అంటివలస గ్రామంలో తమ బంధువుల ఇంటికి వెళ్లి, స్వగ్రామానికి నడుచుకుంటూ వస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. లక్ష్మణ్ వ్యవసాయ కూలీగా జీవనంసాగిస్తున్నాడు. ఈయనకు భార్య లక్ష్మి, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

●పరీక్ష తప్పిన బాధలో నిర్ణయం
●తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకున్న వైనం



స్రవంతి (ఫైల్)

భోగాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన ముగశాల స్రవంతి(19) ఇంటర్‌లో పరీక్ష తప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. అదే బాధతో ఉరి వేసుకుని తనువు చాలించింది. పోలీసుల కథనం మేరకు.. స్రవంతి విశాఖ జిల్లా తగరపువలసలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివింది. ఈనెల 12న వెలువడిన ఫలితాల్లో ఫెయిల్ అయినట్లు తెలుసుకుంది. కెమిస్ట్రీ సబ్జెక్టు తప్పింది. తను ఫలితం ఈ విధంగా వస్తుందని ఊహించలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఫలితాలు వచ్చినప్పటి నుంచి ఇంటివద్ద ముభావంగా ఉంది. ఆదివారం ఉదయం తల్లి శ్యామల విజయనగరం వెళ్లింది. తండ్రి సూరిబాబు గ్రామ సమీపంలో పొలం పనులకు వెళ్లాడు. నానమ్మ, తాతయ్యలు ఇంటి ఆరుబయట కూర్చొన్నారు. ఇంట్లోనే ఒంటరిగాఉన్న స్రవంతి మరింత కుమిలిపోయింది. స్నేహితులు ఉత్తీర్ణులవ్వడం.. తాను పరీక్ష తప్పడంతో తీవ్రంగా బాధపడుతూ ఇంట్లో శ్లాబు ఉక్కుకు ఉరివేసుకుంది. ఆరుబయట కూర్చొన్న నానమ్మకు ఇంట్లో ఏదో వేలాడుతున్నట్లు కనిపించి లోపలికి వెళ్లి చూసింది. తట్టుకోలేక చుట్టుపక్కల వారిని పిలిచింది. వారంతా వచ్చేటప్పటికే స్రవంతి విగత జీవిగా మారింది.స్రవంతి భౌతికదేహం వద్ద తల్లిదండ్రుల రోదనచూసిన వారంతా కన్నీరు పెట్టుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దింపి విచారించి సుందరపేట ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం పంపించారు. స్రవంతికి తమ్ముడు నరితిన్ కుమార్ ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.పాపారావు తెలిపారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

గరివిడి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలు ఆధ్యాత్మికత వల్ల ప్రశాంతతకు నిలయంగా ఉంటాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. అప్పన్నవలసలోపైడితల్లి అమ్మవారి వార్షికోత్సవం పురస్కరించుకుని దర్శించుకున్నారు.ఈసందర్భంగా రామ్‌మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పూజలు జరగడంవల్ల ఆధ్యాత్మిక చింతన పెరిగి ప్రశాంతం, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, దిండి రమేష్, జనసేన నాయకులు విసనగిరి శ్రీను పాల్గొన్నారు.

'ఉపాధి'లో అట్టడుగున...!

(ఐదో పేజీ తరువాయి)

హెచ్చరించడంతో నోటీసులు అందుకున్నవారు సంజాయిషీకి మల్లగుల్లాలు పడుతున్నారు.

మూడు మండలాలకు మినహాయింపు..

షోకాజ్ నోటీసులు నుంచి వంగర, పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు మినహాయింపు ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో జిల్లా అట్టడుగున ఉండగా జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో వంగర, పూసపాటిరేగ, భోగాపురం నిలిచాయి. దీంతో ఆ మండలాల సిబ్బందికి షోకాజ్ నోటీసుల నుంచి మినహాయించారు. సగటు రూ.200 లోపు కనీస వేతనం వచ్చిన మండలాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

జిల్లాకూ నష్టమే?

అతితక్కువ వేతనం గిట్టుబాటు కారణంగా రాష్ట్రస్థాయిలో అట్టడుగున ఉండడంతో ఆ ప్రభావం జిల్లాకు మంజూరయ్యే ఉపాధి నిధులపై పడే ప్రమాదం ఉండొచ్చునని పలువురు అనుమానిస్తున్నారు. ఏదేమైనప్పటికీ ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పన, ఈ నిధులతో పనులు చేపట్టడం, వేతనదారులకు కనీస వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడడం,వేతనాలు సకాలంలో విడుదల అయ్యేలా శ్రద్ధ తీసుకోవడంలో ఇప్పటివరకు జిల్లాకు ఎంతో మంచిపేరు ఉండేది. గతంలో పలు అవార్డులు జిల్లాను వరించాయి. తాజా పరిణామాలు మొదటిసారి జిల్లా తలదించుకునేలా చేసాయన్న ఆవేదన ఉద్యోగవర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఎండలపై నెపం..

మండే ఎండల కారణంగా వేతనదారులు పూర్తిస్థాయిలో పనులు చేయలేదని నెపం వారిపై నెట్టేసే ప్రయత్నం జరుగుతున్నట్టు సమాచారం. షోకాజ్ అందుకున్న అధికారులు, సిబ్బంది ఇదే విషయాన్ని సంజాయిషీలో పేర్కొనాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 10న నోటీసు అందుకున్న ఉపాధిహామీ పథకం అధికారులు,సిబ్బంది మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరారు. అయితే సెలవలు కావడంతో మంగళ లేదా బుధవారం నాటికి బదులివ్వాల్సి ఉంది.

నోటీసులు ఇచ్చాం..

ఉపాధిలో దినసరి వేతనం గిట్టుబాటు అయ్యేలా సిబ్బంది ప్రయత్నించాలి. మూడు మండలాలు మినహా అన్నీ రూ.200 దినసరి వేతనం కల్పించడంలో వెనకబడ్డాయి. ఉపాధి వేతనదారులకు దినసరి వేతనం రూ.200 లోపు కలిగిన మండల అధికారులకు నోటీసులు ఇచ్చాం. ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, జేఈ, ఈసిలకు నోటీసులు అందజేశాం.

-శారదాదేవి, పీడీ, డ్వామా

మహిళల ఉపాధికి భరోసా

(5వ పేజీ తరువాయి)

మండల కేంద్రాల్లో రెండు రోజుల పాటు శిక్షణనిచ్చారు. వీఏఓల సహకారం, సూచనలతో ఈ ఎన్యూమరేటర్లు జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా మహిళల్ని కలిసి వారి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఉన్న 40,522 పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న 4,46,247 మంది మహిళల నుంచి ఈ వివరాలు సేకరిస్తున్నారు.

ఏయే వివరాలు?

పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న ప్రతి మహిళను సర్వే సిబ్బంది కలిసి సమగ్రంగా వివరాలు నమోదు చేస్తున్నారు. డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్న మహిళ ఫోన్ నంబరు, కులం, విద్యార్హత, వృత్తి, భర్త చేసే వృత్తి, ఇతర వివరాలు, పిల్లల చదువు, వారి పూర్తి వివరాలు, సంఘం నుంచి నేటి వరకూ తీసుకున్న అంతర్గత రుణ వివరాలు, వాటి బకాయిలు, తీసుకున్న అంతర్గత రుణంలో నేటి వరకూ జీవనోపాధి కోసం వినియోగించిన మొత్తం, ఇతర ఖర్చులు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్) ద్వారా తీసుకున్న రుణాలు, ప్రస్తుతం ప్రణాళికలో (2025 మార్చితో అంతమయ్యే) ఆర్థిక సంవత్సరానికి ఎంత రుణం అవసరం, తీసుకున్న మొత్తంలో జీవనోపాధి కోసం వినియోగించనున్న మొత్తమెంత, ఆ మొత్తంలో ఇతర ఖర్చులేమిటి, ఎంపిక చేసుకున్న వ్యాపారానికి ఎంత వినియోగిస్తారు అనే అంశాలపై ఎన్యూమరేటర్లు మహిళల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. దీంతో పాటు నెలకొల్పాలనుకున్న వ్యాపార యూనిట్ కోసం 2026 మార్చి లోగా ఏ నెలలో రుణం అవసరమవుతుందన్న విషయాన్ని కూడా మహిళల నుంచి ఆరా తీస్తున్నారు. ఇంటి నిర్మాణం, పెళ్లి, పిల్లల విద్యాభ్యాసం (వ్యాపారేతర వ్యయాలు) కోసం ఎంత వినియోగించాలనుకుంటున్నారన్న వివరాలు ఈ సర్వేలో పొందుపరుస్తున్నారు.

● జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాలను మోనటరింగ్ చేయడం కోసం ఇప్పటికే 1023 మంది మహిళలు వెలుగు ఆధ్వర్యంలో వీఓఏలుగా సేవలందజేస్తున్నారు. వీరు కూడా తాజా సర్వేలో ఎన్యూమరేటర్లకు సహకరిస్తూ సర్వే వేగవంతంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందజేస్తున్నారు. ఇదిలా ఉండగా, తాజాగా నిర్వహిస్తున్న సర్వేలో ఎక్కువ మంది టైలరింగ్, కిరాణా, దస్తులవ్యాపారం, డెయిరీ తదితర యూనిట్ల స్థాపనకు మొగ్గు చూపిస్తున్నట్టు తెలిసింది.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ


బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. పాలకొండ మండలం వాటపాగు గ్రామంలో ఆదివారం తాగునీటి బోరుతోపాటు ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పశువుల నీటి తొట్టెలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నియోజకవర్గ అభివృద్ధి పట్ల వైసీసీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. నియోజకవర్గంలో రహదారుల తోపాటు కాలువల నిర్మాణం, పశువులకు గోశాలలు ఇలా అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాను, వైస్ ఎంపీపీ వి.అనిల్, తూర్పు కాపు డైరెక్టర్ జి.సత్తిబాబు, రామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయం ప్రారంభం


దేశపాత్రునిపాలెం రామాలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

కొత్తవలస, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశపాత్రునిపాలెంలో సీతారాములు ఆలయం ప్రారంభించారు. శనివారం విశేష హోమాలను నిర్వహించగా ఆదివారం ఆలయంలో సీతా,రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ గోపురంపై శిఖర ప్రతిష్ఠ ప్రముఖ వేద పండితుడు ఓం సదనం నిర్వాహకుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో 10 మంది వేదపండితులు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన సీతారాముల కల్యాణానికి ఎస్.కోట ఎమ్మెల్యేకోళ్ల లలిత కుమారి, కేబీఏ రాంప్రసాద్ దంపతులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుబ్బలక్ష్మి దంపతులు హాజరయ్యారు.

ఏడు కోవెళ్ల ఆలయం..

గుర్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చింతలపేటలో ఏడు కోవెళ్ల ఆలయం ఆదివారం ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త సంచాన వెంకటరావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

● గ్రామాల్లో క్రైస్తవుల నగర సంకీర్తన

మట్టల ఆదివారం కార్యక్రమాన్ని జిల్లాలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల పాదర్లు, వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పురవీధుల్లో మట్టలతో నగర సంకీర్తన చేశారు. గీతాలు ఆలపించారు. జయహో ఏసు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు, చిన్నారులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


బొబ్బిలి రూరల్: అలజంగిలో..


పార్వతీపురంటౌన్: ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


కురుపాం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


భామినిలో మట్టల ప్రదర్శన


గరివిడి: మట్టల పండుగలో చిన్నారులు


బొబ్బిలిలో మట్టలతో నగర సంకీర్తన

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఎల్విన్‌పేటలో ఓ గిరిజనేత్రుడు తన మద్దతుతో భవన నిర్మాణం చేపడుతున్నాడని తప్పుడు ఆరోపణ చేయడం సరికాదన్నారు. 'మీరు పదేళ్లలో వేయని రోడ్లు.. మేము 11 నెలల్లో వేసి చూపించామని, ఇప్పుడు వచ్చిన పనులను కాంట్రాక్టర్లు, నాయకులు, కర్యకర్తలు చేస్తుంటే.. మీ హయాంలో మీ మరిది మాత్రమే చేశార'ని ఆమె ఆరోపించారు. తనకు దోచకోవడం తెలియదని.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పాలన మాత్రమే తెలుసునని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఉన్న గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ప్రెస్‌మీట్లు పెట్టి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి కడ్రక మల్లేశ్వరరావు, కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి, టీడీపీ నాయకుడు కోలా రంజిత్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్లు పాడి సుధ, శేఖర్ ప్రాతుడు, అక్కేన మధు, బీజేపీ నిమ్మక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం తగదు

● ఎమ్మెల్యే బేబీనాయన


మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలో గోవుల మరణాలకు సంబంధించి టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న అసత్య ప్రచారం కేవలం మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర అని ఎమ్మెల్యే బేబీనాయన ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక కోటలో విలేకర్లతో మాట్లాడారు. టీటీడీ ప్రతిష్ఠకు, పవిత్రతకు భంగం కలిగేలా గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ భూమన చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమని అన్నారు. గోశాలలో గల 1668 ఆవులకు జియోట్యాగ్ చేసి ప్రతిరోజూ పర్యవేక్షిస్తుంటే.. జీయోట్యాగ్ తీసేశారని విషప్రచారం చేయడం తగదన్నారు. వేంకటేశ్వరస్వామి ఓ నల్లరాయి అని దానిని పెకిలించేస్తానంటూ గతంలో మాట్లాడిన వ్యక్తి భూమన అని, కొవిడ్ సమయంలో స్వామి ప్రసాదాలను దారి మళ్లించి అపచారాలకు పాల్పడ్డారని, అవినీతి అక్రమాలతో టీటీడీ ఖజానాకు చిల్లుపెట్టారని ఎమ్మెల్యే ఆరోపించారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ, మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా అసత్య ప్రచారాలు చేస్తున్న కరుణాకరరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బేబీనాయన డిమాండ్ చేశారు.

న్యూస్ బాక్స్

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

బొబ్బిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరిశర్ల రామారావు నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ చట్టంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం విజయనగరంలో పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ ధర పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నెత్తిన గుదిబండ మోపిన మోదీపై బాబు, పవన్‌లు నోరు మెదపడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు రంగరాజు, శాంతి, వాసు, సూరీడమ్మ పాల్గొన్నారు.

సంప్రదాయాన్ని కొనసాగిస్తూ..


పల్లకిలో పెళ్లికూతురిని ఊరేగిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పల్లకిలో పెళ్లి కూతురిని ఊరేగించే సంప్రదాయం ఇప్పటికీ కొన్ని పల్లెల్లో కొనసాగుతుండడం విశేషం. బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో ఆదివారం ఓ పెళ్లిలో పెళ్లికూతురిని పల్లకిలో ఊరేగించడం కనిపించింది.

విజయనగరంలో రక్తదానం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. ఆదివారం విజయనగరంలోని బీసీ కాలనీలో యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇల్తామస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు శరత్, అశోక్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు


గజపతినగరం: జన్మదిన వేడుకల్లో మంత్రి శ్రీనివాస్


విజయనగరం రూరల్: శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ గజపతినగరం నాయకులు


డెంకాడ: శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న కంది చంద్రశేఖరరావు, తదితరులు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విజయనగరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి తన సతీమణితో కలిసి పూజలు చేశారు. తొలుత టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు ఫోన్ ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు నియోజకవర్గ నాయకులతో కలిసి కొండపల్లి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్‌కు ఆయన తండ్రి కొండపల్లి కొండలరావు, కర్ణింపూడి జగన్నాథరావు, రంధి రామునాయుడు, రంధి అర్జునమహేశ్వరరావు, రంధి చినరామునాయడు, సుంకరి రామునాయుడు, సంక్రాన పైడిరాజు, గోపీశెట్టి శంకరరావు, పల్లి వెంకటరావు, కశిరెడ్డి పాపినాయుడు, మజ్జి రామకృష్ణ, కొరుప్రోలు కిషోర్‌కుమార్, సుంకరి సాయికృష్ణ, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

●గజపతినగరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గజపతినగరంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో కేక్ కట్ చేసి నియోజకవర్గ స్థాయి అధికారులు, నాయకులు,కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడశ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువశ్రీధర్, నాయకులు శీరంరెడ్డి రామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, లెంక బంగారునాయుడు పాల్గొన్నారు.

● డెంకాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కంది చంద్రశేఖర్‌రావు, డెంకాడ మండల టీడీపీ అధ్యక్షులు పల్లె భాస్కర్‌రావు, విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణరెడ్డి, టీడీపీ డెంకాడ మండల ఉపాధ్యక్షులు పడాల చిన్నారావు, సెక్రటరీ కొయనేని రమణ, యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పిస్సింటి రమేష్‌నాయుడు, ఆబూతుల ప్రవీణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మజ్జి గౌరమ్మ ఉత్సవాలు ప్రారంభం



బొబ్బిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని నెయ్యిలవీధి, యాత వీధుల్లో ఆదివారం మజ్జి గౌరమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. సాయంత్రం మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు చెల్లించారు.

ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మున్సిపల్ బావిని కప్పేందుకు యత్నం

● అడ్డుకున్న స్థానికులు

బొబ్బిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని వరాహగిరి వారి వీధిలో గల మున్సిపల్ బావిని ఆదివారం కప్పే ప్రయత్నం చేయడంతో స్థానికులు ఆగ్రహించి అడ్డుకున్నారు. ఈ వీధిలో చాలా సంవత్సరాలుగా ఉన్న బావిని స్థానికంగా బహుళఅంతస్తు నిర్మించాలనే ఉద్దేశంతో కప్పేందుకు ఓ వ్యాపారి ప్రయత్నించారు. మున్సిపల్ కుళాయిలు రానప్పుడు, తాగునీటి ఎద్దడి ఉన్నప్పుడు, వేసవిలో నీటి అవసరాలను తీర్చుకునేందుకు ఈ బావి నీటిని వినియోగిస్తున్నామని, అలాంటి బావిని కప్పేస్తే తమ నీటి అవసరాలకు కోసం ఎక్కడికి వెళ్లాలని గంధం మధు తదితరులు ప్రశ్నించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ బావిని యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ● దీనిపై మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి స్పందించి తమ సిబ్బందిని అక్కడికి పంపించి పనులను అడ్డుకున్నారు. మున్సిపల్ బావికి ఎటువంటి నష్టం కలగకుండా తగిన రక్షణ కల్పించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో బావి మనుగడకు రక్షణ కల్పిస్తామని యజమాని తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

జిల్లా వాప్యంగా పలు కేంద్రాల్లో గురుకులా ల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం పరీక్షలను నిర్వహించారు.

రేగిడి, ఏప్రిల్ 13,(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉంగరాడ గురుకులంలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఐదో తరగతికి, మధ్యాహ్నం ఇంటర్‌కు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఐదో తరగతికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 150 మందికిగాను 52 మంది హాజరుకాగా, ఇంటర్ ప్రథమసంవత్సరానికి 139 మంది దరఖాస్తుచేసుకోగా 56మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస రావు తెలిపారు. పరీక్షల నిర్వహణను తహసీల్దార్ చిన్నారావు, పరీక్షల ప్రత్యేక అబ్జర్వర్ కామేశ్వరి పర్యవేక్షించారు. ● చీపురుపల్లి: అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ రాణిశ్రీ తెలిపారు. ఉదయం ఐదో తరగతి, మధ్యాహ్నం ఇంటర్ ప్రవేశ పరీక్ష లు జరిగాయని చెప్పారు. చీపురుపల్లి గురుకులంలో జరిగిన ఐదో తరగతి పరీక్షకు 228 మంది హాజరు కావాల్సి ఉండగా 144 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు 195 మందికి 144 మంది హాజరైనట్లు తెలిపారు. కాగా రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ రూపవతిలు ఈ పరీక్షలను పర్యవేక్షించారు. ● వేపాడ: బక్కునాయుడు పేట అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలను రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ సునీల్ రాజు కుమార్ పరిశీలించారు. ఐదో తరగతి ప్రవేశాలకు 89 మంది, ఇంటర్‌లో ప్రవేశానికి 61 మంది హాజరై పరీక్ష రాశారు. ఇంటర్ ప్రవేశ పరీక్షను అడిషనల్ సెక్రటరీ సునీల్ రాజుకుమార్ పరిశీలించారు.

జనసేన నాయకునిపై హత్యాయత్నం

(5వ పేజీ తరువాయి)

విజయనగరం తీసుకెళ్లారు. ధనంజయ్‌పై దాడిచేసిన వ్యక్తి పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్టు తెలిసింది. సమాచారం అందిన వెంటనే బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు స్టేషన్‌కు చేరుకున్నారు. ● మండల కేంద్రంలో ఉన్న జనసేన నాయకుడు మహంతి ధనంజయపై వైసీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతి నాయుడు, సీఐటీయూ జిల్లా నాయకుడు పి.శంకరరావులు ఖండించారు. ఇటువంటి భౌతిక దాడులు దారుణమన్నారు.